

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 19-08-2026 | సంపుటి - 31 | సంచిక - 86 | రూ : 4 | పేజీలు : 8


## ఆత్మనిర్భరత దేశానికేనా ?




- అగమ్యగోచరంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి
- ఆదాయ వ్యయాల మధ్య పెరుగుతున్న అంతరం
- దశాబ్ద కాలంగా కేంద్రం దయాదాక్షిణ్యాల పైనే ఆధారం
- తగ్గుతున్న వనరుల బదిలీలు

2లో

## జయహో బీసీ

- స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 34% రిజర్వేషన్లు
- ఉత్తర్వులివ్వడమే కాదు.. వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం



### హర్మూజ్ జలసంధి మాదే.. అమెరికా

## కొత్త భూభాగమంటూ ట్రంప్ సంచలన పోస్ట్!

- ట్రూత్ సోషల్ మీడియాలో మ్యాప్ పోస్ట్
- ఇది పగటి కలేనంటూ కొట్టిపారేసిన ఇరాన్
- జలసంధిలో సరుకు రవాణా నౌకలపై కొనసాగుతున్న దాడులు




హర్మూజ్ జలసంధిని 'అమెరికా నూతన భూభాగం'గా ప్రకటిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో ఒక మ్యాప్‌ను పోస్ట్ చేశారు. ఇరాన్‌తో కుదిరిన 60 రోజుల అవగాహన ఒప్పందం గడువు ముగిసిన మరుసటి రోజే ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. "హర్మూజ్ జలసంధిని పునరుద్ధరించాం. నౌకా రవాణా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. సముద్ర గర్భంలో అమర్చిన మైన్‌లన్నింటినీ మేము తొలగించాం లేదా నిర్వీర్యం చేశాం" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే, ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికాదళ దిగ్బంధం యథాతథంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌తో ప్రస్తుతం ఎలాంటి చర్చలు జరగడం లేదని, భవిష్యత్తులో కూడా చర్చల ప్రసక్తి లేదని ఆయన వెల్లడించారు. కాగా, ట్రంప్ ప్రకటనకు, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులకు మధ్య పొంతన కుదరడం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. జలసంధిలో నౌకల రాకపోకలు ఇంకా సాధారణ స్థితికి చేరుకోలేదు. మంగళవారం కూడా ఒక బల్క్ క్యారియర్‌పై గుర్తుతెలియని ప్రొజెక్టైల్‌తో దాడి జరగగా, పలువురు సిబ్బంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో, నౌకలు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజెన్సీ సూచించింది. ట్రంప్ ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. కేవలం ఒక సోషల్ మీడియా పోస్టుతో జలసంధిని స్వాధీనం చేసుకోవడం పగటి తరువాయి 2లో

### ప్రతి అభ్యర్థికీ

## విశిష్ట గుర్తింపు సంఖ్య!

- దరఖాస్తు దశ నుంచే సమస్త సమాచారం నిక్షిప్తం
- పోలీసు నియామకాల్లో వినూత్న ప్రయోగం

హైదరాబాద్: పోటీ పరీక్షల నియామకాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా తెలంగాణ పోలీసు నియామక మండలి (టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ) మరో ప్రయోగం చేయనుంది. హోం తదితర శాఖల్లో పోస్టుల భర్తీకి చేపడుతున్న నియామకాల ప్రక్రియలో కచ్చితత్వం కోసం అభ్యర్థుల సమస్త వివరాలను ప్రత్యేకంగా నిక్షిప్తం చేస్తోంది. ఇందుకోసం ప్రతి అభ్యర్థికి యూనిక్ ఐడీ (విశిష్ట గుర్తింపు సంఖ్య)ని కేటాయిస్తోంది. దరఖాస్తు దశ నుంచి అభ్యర్థి ఉద్యోగం సాధించడం లేదా పోటీ నుంచి నిష్క్రమించే వరకు గల పూర్తి వివరాలను అందులో పొందుపరుస్తోంది. ఈ క్రమంలో ఫామ్ ఏ, ఫామ్‌బీలతో కూడిన ప్రొఫార్మాను రూపొందించింది. నియామకాలకు సంబంధించి ఎవరైనా అభ్యర్థులు ఫిర్యాదు చేసినా.. న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు వేసినా ఈ వివరాలే కీలకం కావడంతో ఈ అంశానికి మండలి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. తరువాయి 2లో

### మీ అండదండలతో

## ఈసారి 117 సీట్లు గెలుస్తాం



- సామాజిక న్యాయం... బహుజనులకు అధికారం.. ప్రజాప్రభుత్వ ఆశయం
- సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సభలో

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: 'బహుజనులు.. కల్లుగీత కార్మికులు.. ప్రజలు.. గౌడన్నల అండదండలతో వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలుస్తాం. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన డి.శ్రీనివాస్, సీఎల్పీ లీడర్‌గా పనిచేసిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి పార్టీని రెండుసార్లు అధికారంలోకి తీసుకొచ్చారు. అదే తరహాలో మహేశ్‌కుమార్‌గౌడ్, నేను కూడా పార్టీని రెండోసారి

## 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ..



- ఉలిక్కిపడిన పాకిస్థాన్!
- 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ డాక్యుమెంటరీతో కలకలం
- భారత్ వాదనలను తప్పుబడుతూ పాక్ సైన్యం అధికారిక ప్రకటన
- ఉగ్రసంస్థలకు భారీ నష్టం జరగడంతో పాక్ ఎదురుదాడి

భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ ఛానెల్ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆగస్టు 15న ప్రసారమైన "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే ఈ డాక్యుమెంటరీతో ఉలిక్కిపడిన పాకిస్థాన్, తరువాయి 2లో

# సామాన్యుల ఆస్తుల రక్షణ బాధ్యత మాది

### సాంకేతిక పొరపాటును సరిదిద్దుతున్నాం

- ధరణి తప్పులను అంగీకరించే ధైర్యం హరీశ్‌కు ఉందా?: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్రంలోని సామాన్యుల ఆస్తుల రక్షణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని, న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళమూ ఈ ప్రభుత్వం తీసుకోదంటూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటికే పరిష్కార ప్రక్రియ ప్రారంభించినట్లు స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... "హైకోర్టు ఆదేశాలతో నిషేధిత జాబితా (22ఏ)లో భూములను నిక్షిప్తం చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో సాంకేతికంగా పొరపాట్లు జరిగాయి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన



సరిదిద్దుతోంది. 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించాం. రెవెన్యూ శాఖ కార్యదర్శి, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. 15 రోజులపాటు కమిటీ దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తుంది.

**వారికి నాకు అదే తేడా...**

భారాస నేత హరీశ్‌రావు ప్రజల తరువాయి 2లో



## ఆ 'నెయ్యి'.. అర్జంటుగా మానెయ్యి..

- చుక్క పాలు కూడా వాడకుండా కల్తీ వెల్లువ
- మిల్క్‌క్రీమ్, పామాయిల్‌తో తయారీ!
- రాజధానిలో 130 కేంద్రాలపై హెచ్-ఫాస్ట్ దాడులు
- 36 టన్నుల కల్తీ సరుకు స్వాధీనం

2లో

## టిస్ స్నాతకోత్సవం..

## ముఖ్య అతిథిగా సీజేఐకి బదులు మరొకరు!

- టిస్ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సీజేఐ సూర్యకాంత్ స్థానంలో మరొకరు
- ఆగస్టు 2న జరగాల్సిన కార్యక్రమం ఆగస్టు 22కు వాయిదా
- విద్యార్థుల నిరసనల భయంతోనే ఈ మార్పు అని ప్రచారం
- సీజేఐ గత వ్యాఖ్యలపై విద్యార్థుల్లో వ్యతిరేకత
- షెడ్యూల్ ఖాళీగా లేదని సీజేఐ కార్యాలయం వెల్లడి



ప్రతిష్ఠాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) తమ 86వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిని మార్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్థానంలో టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్. ప్రమేశ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు సంస్థ ప్రకటించింది. గతంలో వాయిదా పడిన ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 22న ముంబైలోని డియోనార్ క్యాంపస్‌లో నిర్వహించనున్నారు. వాస్తవానికి ఈ స్నాతకోత్సవం ఆగస్టు 2న జరగాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల కార్యక్రమానికి రెండు రోజుల తరువాయి 2లో

# సామాన్యుల ఆస్తుల రక్షణ బాధ్యత మాది

హైదరాబాద్: రాష్ట్రంలోని సామాన్యుల ఆస్తుల రక్షణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని, న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళమూ ఈ ప్రభుత్వం తీసుకోదంటూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటికే పరిష్కార ప్రక్రియ ప్రారంభించినట్లు స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... "హైకోర్టు ఆదేశాలతో నిషేధిత జాబితా(22ఏ)లో భూములను నిక్షిప్తం చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో సాంకేతికంగా పొరపాట్లు జరిగాయి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సరిదిద్దుతోంది. 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించాం. రెవెన్యూ శాఖ కార్యదర్శి, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. 15 రోజులపాటు కమిటీ దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తుంది.

**వారికి నాకు అదే తేడా...**

భారాస నేత హరీశ్‌రావు ప్రజల సమస్యను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు బురదచల్లుతున్నారు. విమర్శలు చేయడం చాలా సులువు.. బాధ్యత తీసుకోవడం అంత సులువు కాదు. 22ఏ విషయంలో పొరపాటును బహిరంగంగా అంగీకరించి సరిచేస్తున్నాం. పదేళ్ల భారాస పాలనలో ధరణిలో అనేక తప్పులు జరిగాయి. ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఏనాడైనా జరిగిన తప్పులకు బాధ్యత తీసుకున్నారా? కనీసం క్షమాపణ చెప్పారా? తప్పులను అంగీకరించే ధైర్యం ఉందా? పదేళ్లు అధికారంలో ఉన్న ఆయనకు ఇప్పటికీ 30% కమీషన్లు ఎందుకు గుర్తుకొస్తున్నాయో ప్రజలకు తెలుసు. భారాస ఏ పద్ధతిలో పాలన సాగించిందో ప్రజలు మరిచిపోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న పరిణామాలకు హరీశ్ ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? నేను క్షేత్రస్థాయిలో అధికారులు చేసిన పొరపాటు గుర్తించి పరిష్కారం చూపే బాధ్యత తీసుకున్నా. వారికి నాకు అదే తేడా" అని చెప్పారు. భాజపా నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై మంత్రి బదులు ఇస్తూ.. "నాపై ఏదైనా ఆరోపణ చేస్తే ఆధారాలతో మాట్లాడాలి. నేను రెండు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్నా. ఒక్కరోజులో రూ.వేల కోట్లకు ఎదిగిన వ్యక్తిని కాదు" అని పేర్కొన్నారు.

*** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.230కే సిమెంట్ బస్తా**

ఈనాడు, హైదరాబాద్: ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న పేదలకు ఒక్కో సిమెంట్ బస్తాని రూ.230కే అందించనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం సిమెంట్ కంపెనీల యాజమాన్యాలు అంగీకరించాయని అన్నారు. మంగళవారం సచివాలయంలో సిమెంటు పరిశ్రమల యాజమాన్యాలతో పొంగులేటి సమావేశమై చర్చించారు. "రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. ఇందులో 85% ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయి. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున 2.50లక్షల ఇళ్లను మంజూరు చేశాం. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. ఈ బృహత్తర పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలి" అని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఉద్యోగార్థులకు శుభవార్త: 10,060 పోస్టుల భర్తీకి ఏపీ కేబినెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో రూ.450 కోట్ల పెట్టుబడి, 7 వేల మందికి ఉపాధి లక్ష్యంగా..వైఎస్సార్ ఈఎంసీ కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు రూ.85,200 కోట్ల పెట్టుబడి, 1,880 మందికి ఉద్యోగ కల్పన లక్ష్యంగా అనకాపల్లి జిల్లా మాకవరపాలెం వద్ద 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు నిమిత్తం రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ లిమిటెడ్‌కు 433.30 ఎకరాల భూమి కేటాయింపు, ప్రోత్సాహకాల మంజూరుకు ఆమోదం. రూ.31,387 కోట్ల పెట్టుబడి, 1,000 మందికి ఉపాధి కల్పన లక్ష్యంగా విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం అమనం వద్ద 512 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటాసెంటర్ ఏర్పాటు నిమిత్తం ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు ఆర్థిక, ఆర్థికేతర ప్రోత్సాహకాల మంజూరు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుట్టపాడు వద్ద అగస్త్య గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 12 గిగావాట్ల ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీతో ఎస్ఐ ఇంగోట్ అండ్ వేఫర్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటు. దీనికి ఎకరా రూ.10 లక్షల చొప్పున 143.26 ఎకరాల భూమి కేటాయింపు. విశాఖపట్నం పరవాడ పారిశ్రామికవాడ వద్ద అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ 3.6 గిగావాట్లతో టాప్ కాన్ సోలార్ సెల్, మాడ్యూల్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం. చిత్తూరు జిల్లా కుప్పం మండలం ఏకర్లపల్లి వద్ద అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్రాజెక్టు విస్తరణకు హిందాల్కో ఇండస్ట్రీస్‌కు 60 ఎకరాల కేటాయింపు రాజధానిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు, అమరావతి రైల్వేలైన్‌కు రాజధాని అమరావతిలో ఎర్రుబాలెంనంబూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్ నిర్మాణం (ఇరువైపులా 50 మీటర్ల బఫర్‌తో మొత్తం 100 మీటర్లు), ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణాల నిమిత్తం.. భూసమీకరణ విధానం కింద గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడకలో 2344.12 ఎకరాలు తీసుకునేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారాలు కల్పిస్తూ మంత్రివర్గ తీర్మానం. రెండో విడత భూసమీకరణ పథకంలో భాగంగా.. గుంటూరు జిల్లా వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లోని దేవాదాయ భూముల వివాదాల పరిష్కారానికి సంబంధించి దేవాదాయ శాఖకు రూ.159.45 కోట్ల పరిహారం చెల్లింపు.. రైత్వారీ పట్టాలు కలిగిన రైతులకు భూసమీకరణ ప్రయోజనాలు కల్పించే ప్రతిపాదనకు ఆమోదం.

## 'వచ్చే ఎన్నికల్లో పెద్దలు ఎవరెవరు పోటీ చేస్తారు?

(మొదటిపేజీ తరువాయి)

. 'ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి 85 ఏళ్లు దాటినా రోజూ స్విమ్మింగ్, వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నారు' అని పక్కనున్నవారు తెలిపారు. మంత్రి ఫరూక్ కల్పించుకుంటూ వరదరాజుల రెడ్డి, బుచ్చయ్యచౌదరి కంటే తాను చిన్నవాడినని చెప్పారు. సీఎం చంద్రబాబు కంటే తాను 20 రోజులు చిన్నవాడినని నవ్వుతూ చెప్పారు.



## ప్రతి అభ్యర్థికీ విశిష్ట గుర్తింపు సంఖ్య!

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్: పోటీ పరీక్షల నియామకాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా తెలంగాణ పోలీసు నియామక మండలి(టీఎస్ఎల్‌పీఆర్‌బీ) మరో ప్రయోగం చేయనుంది. హోం తదితర శాఖల్లో పోస్టుల భర్తీకి చేపడుతున్న నియామకాల ప్రక్రియలో కచ్చితత్వం కోసం అభ్యర్థుల సమస్త వివరాలను ప్రత్యేకంగా నిక్షిప్తం చేస్తోంది. ఇందుకోసం ప్రతి అభ్యర్థికి యూనిక్ ఐడీ (విశిష్ట గుర్తింపు సంఖ్య)ని కేటాయిస్తోంది. దరఖాస్తు దశ నుంచి అభ్యర్థి ఉద్యోగం సాధించడం లేదా పోటీ నుంచి నిష్క్రమించే వరకు గల పూర్తి వివరాలను అందులో పొందుపరుస్తోంది. ఈ క్రమంలో ఫామ్‌ఏ, ఫామ్‌బీలతో కూడిన ప్రొఫార్మాను రూపొందించింది. నియామకాలకు సంబంధించి ఎవరైనా అభ్యర్థులు ఫిర్యాదు చేసినా.. న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు వేసినా ఈ వివరాలే కీలకం కావడంతో ఈ అంశానికి మండలి అత్యంత ప్రాధాన్యమిస్తోంది.

**ప్రతి దశా కీలకమే...**

మిగిలిన పోటీ పరీక్షలతో పోల్చితే యూనిఫాం సర్వీసులకు శారీరక సామర్థ్య పరీక్షలు అదనం. వీటి నిర్వహణ సవాళ్లతో కూడుకొని ఉంటుంది. దీనికితోడు కటాఫ్ మార్కులను హారిజాంటల్, వర్టికల్ విధానాల్లో పకడ్బందీగా కేటాయించాలి. వీటిపై అభ్యర్థులు అనేక సందేహాలు లేవనెత్తే అవకాశముంటుంది. అందుకే ప్రతి దశలో అభ్యర్థి కనబరిచే ప్రతిభ, సామర్థ్యానికి సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని యూనిక్ ఐడీలో నిక్షిప్తం చేస్తున్నారు. ఎంపిక ప్రక్రియ ముగిసేవరకు.. అభ్యర్థులు దరఖాస్తులో పేర్కొన్న వివరాలనే ప్రామాణికంగా తీసుకుంటారు. తొలుత ప్రాథమిక రాతపరీక్ష నిర్వహిస్తారు. ఈ సమయంలో అభ్యర్థులు పార్ట్ 1 దరఖాస్తును నింపాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైతేనే తదుపరి దశ కోసం పార్ట్ 2 దరఖాస్తును పూరించాలి. వీటిలోని వివరాలు ఎప్పటికప్పుడు ఐడీలో నిక్షిప్తమవుతాయి. పార్ట్ 2 దరఖాస్తు నమోదు చేసిన అనంతరం నిర్వహించే శారీరక కొలతల పరీక్ష (పీఎంటీ), శారీరక సామర్థ్య పరీక్ష (పీఈటీ)ల వివరాలతోపాటు తుది రాతపరీక్షలో కనబరిచిన ప్రతిభ, అభ్యర్థి పూర్వచరిత్రకు సంబంధించి స్పెషల్‌బ్రాంచ్ (ఎస్‌బీ) విచారణ సమాచారాన్నీ పొందుపరుస్తారు. ఇలా అన్ని దశల్లో సమగ్ర వివరాలను ఒకేచోట పొందుపరచడం ద్వారా వివాదాలను నివారించాలని అధికారులు భావిస్తున్నారు.

## మీ అండదండలతో ఈసారి 117 సీట్లు గెలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి తెస్తాం. సామాజిక న్యాయం... బహుజనులకు అధికారం.. ప్రజాప్రభుత్వ ఆశయం. భారాస నాయకులు మతి భ్రమించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. చివరకు అఘోరా పూజలు, చేతబడులు చేయిస్తున్నారు. బహుజనుల కోసం పోరాడి గోల్కొండ ఖిల్లాను జయించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రజలందరికీ ప్రజాప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై మంగళవారం సాయంత్రం జరిగిన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. బహుజనులపై రాజులు, భూస్వాములు, జమీందార్లు దాడులు చేస్తుంటే సహించలేక పాపన్న ఒక్కడే సైన్యంగా మారి దండయాత్రలు చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన చరిత్ర బ్రిటిష్ లైబ్రరీలో ఒక గ్రంథంగా ఉందని అన్నారు. ఆ చరిత్ర అందరికీ తెలియాలని.. ఆయన పోరాట స్ఫూర్తితో లక్షల మంది తమ జీవితాలను మార్చుకోవాలన్న లక్ష్యంతోనే ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేశామని వివరించారు. ఈ శుభ సందర్భంలోనే ముదిరాజుల ఆరాధ్యుడు పండుగ సాయన్న జయంతి అక్టోబరు 22ను ఏటా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.

**కాలువల గట్లపై ఈత, తాటి చెట్లు..**

"గీత కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా గీత, చేనేత కార్మికులకు అందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆదేశించాం. కుల వృత్తినే జీవనాధారంగా చేసుకున్న గౌడ సోదరులారా.. రాష్ట్రంలోని కాలువ గట్లపై ఈత, తాటి చెట్లను పెంచుకోండి. సారవంతమైన కల్లును తయారు చేయండి. ఆ చెట్లు పెంచుకునేందుకు సహకరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరుదాం. అవి ఎదగడానికి నాలుగైదేళ్లు పడుతుంది. తర్వాత క్రమం తప్పకుండా కల్లు విక్రయాలతో ఆదాయం వస్తుంది. భారాస ప్రభుత్వంలో.. బర్రెలు, గొర్రెలు కాసుకోండి, చెప్పులు కుట్టుకోండి అన్నారు. మేము మాత్రం.. మీ కులవృత్తులు కొనసాగిస్తూనే మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని కోరుతున్నాం. ఎందుకంటే... మీ తల రాతను ఇప్పుడు మీరు మార్చుకోలేరు. మీ పిల్లల్ని చదివిస్తే.. వారు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లుగా మారి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతారు. చదువుకోవడం వల్లే మధుయాస్కీ గౌడ్ విదేశాలకు వెళ్లారు. అక్కడ ఎంతోమందికి సాయం చేశారు.

## ఆత్మనిర్భరత దేశానికేనా ?

(మొదటిపేజీ తరువాయి)

న్యూఢిల్లీ : రాష్ట్రాలు స్వావలంబన సాధించాలని సుద్దులు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి ప్రోత్సాహం అందించడం లేదు. సరికదా వివక్షాపూరిత విధానాల ద్వారా రాష్ట్రాలు తనపై ఆధారపడేలా చేస్తోంది. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2020 మే 12వ తేదీన ఆత్మనిర్భర్ భారత్ అనే మిషన్‌ను 20 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీతో ప్రారంభించింది. దేశాన్ని స్వయంసమృద్ధి కలిగిన దేశంగా మార్చడమే దీని ఉద్దేశం. స్థానికంగా ఉత్పత్తులను పెంచడం, దిగుమతులను తగ్గించుకోవడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం దీని లక్ష్యాలు. కీలక వనరులను బాహ్య శక్తులు నియంత్రించకుండా నిరోధించడం కూడా దీని ఉద్దేశమే. అయితే ఈ లక్ష్యాల సాధనలో ప్రభుత్వం పూర్తిగా చతికిల పడింది. కేంద్రం బలంగా ఉండాలంటే రాష్ట్రాలు కూడా పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే ఎన్డీఏ పాలనలో రాష్ట్రాలు ఏ చిన్న అవసరం వచ్చినా కేంద్రం వైపు చూసే పరిస్థితి నెలకొంది.

**హస్తిన వైపే చూపు**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఎర్రకోట ప్రాంగణం నుంచి ప్రసంగిస్తూ భారత్ ఇక ఎవరి పైనా ఆధారపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇతరులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలంటూ మోడీ ప్రభుత్వం ఎంతగా ప్రచారం సాగిస్తున్నప్పటికీ దానికి భిన్నంగా గత దశాబ్ద కాలంలో మన రాష్ట్రాలు ఢిల్లీ పైనే ఎక్కువగా ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. పదిహేడు సంవత్సరాల కేంద్ర బడ్జెట్ గణాంకాలను విశ్లేషిస్తే ఈ ఆధారపడడం అనేది మరింత అధికమైంది. దేశ ఆర్థిక వ్యవస్థ ఓ అంతర్గత అసమతుల్యతతో ఏర్పడింది. దీనిని గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు ఆ అసమతుల్యత అవసరమైనదేనని అంగీకరించారు. ఆరోగ్యం, విద్య, పోలీసు వ్యవస్థకు సంబంధించి అయ్యే ఖర్చులను రాష్ట్రాలే భరిస్తాయి. ఇవి పౌరులను నేరుగా ప్రభావితం చేసే సేవలు. అయితే ఆదాయపన్ను, కార్పొరేట్ పన్ను, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వంటి మార్పులకు గురయ్యే, స్థిరమైన పన్నులపై కేంద్రానికి నియంత్రణ ఉంటుంది.

**ఆదాయం కంటే ఖర్చే అధికం**

విద్య, ఆరోగ్యం వంటి పౌరులకు సంబంధించిన సేవలను స్థానికంగానే మెరుగ్గా నిర్వహించుకోవచ్చు. అయితే సంక్షోభాల సమయంలో ఆర్థిక వ్యవస్థను రాష్ట్రాలు నిర్వహించలేవు. ద్రవ్య సరఫరా, రుణాలపై కేంద్రానికే నియంత్రణ ఉంటుంది. రాబడికి తగిన విధంగానే ఖర్చు ఉండాలనేది ఓ విధానం. ఈ సూత్రాన్ని ఆర్థిక సంఘం కూడా సమర్థించింది. అయితే ఈ సమన్వయం ఎన్నడూ సాధ్యపడలేదు. రాష్ట్రాల వ్యయం, ఆదాయం మధ్య ఉన్న అంతరం దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. కొన్ని అంచనాల ప్రకారం ఈ అంతరం ప్రభుత్వ ఆదాయంలో 60 శాతం వరకూ ఉంటోంది. అంటే రాష్ట్రాలు తాము సమకూర్చుకున్న ఆదాయం కంటే చాలా ఎక్కువగా ఖర్చు చేస్తున్నాయని అర్థం. ఈ అంతరాన్ని నివారించడానికి ఉద్దేశించిన యంత్రాంగమే అధికార వికేంద్రీకరణ. 2015లో 14వ ఆర్థిక సంఘం పంపిణీ చేయదగిన నిధులలో రాష్ట్రాల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచింది. దీని ద్వారా రాష్ట్రాలు కేంద్ర వాటాను గణనీయంగా పొందగలిగాయి. ఫలితంగా కేంద్ర సాయంపై పెద్దగా ఆధారపడాల్సిన అవసరం లేకపోయింది. అయితే కేంద్రం యొక్క పన్ను రాబడిలో ఈ నిధిలోకి వెళ్లే వాటా తగ్గిపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది.

## టిస్ స్నాతకోత్సవం..
## ముఖ్య అతిథిగా సీజేఐకి బదులు మరొకరు!

(మొదటిపేజీ తరువాయి)

ముందు దీనిని వాయిదా వేశారు. అయితే, ప్రధాన న్యాయమూర్తి పర్యటన సందర్భంగా విద్యార్థుల నుంచి నిరసనలు వ్యక్తమవుతాయనే ఆందోళనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆకస్మిక వాయిదాతో ప్రయాణ, వసతి ఏర్పాట్లు చేసుకున్న విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వారికి జరిగిన ఆర్థిక నష్టాన్ని భర్తీ చేస్తామని సంస్థ హామీ ఇచ్చింది. గతంలో జస్టిస్ సూర్యకాంత్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు, విద్యార్థుల నిరసనలపై పోలీసు చర్యలను సమర్థించడం వంటి అంశాలు వివాదానికి దారితీశాయి. ఇదే తరహాలో హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఆయనను ఆహ్వానించడాన్ని కూడా వందలాది మంది విద్యార్థులు వ్యతిరేకించారు. మరోవైపు, నవంబర్ వరకు తన షెడ్యూల్ బిజీగా ఉన్నందున కొత్త తేదీల్లో హాజరు కాలేనని ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం టిస్ యాజమాన్యానికి తెలియజేసినట్లు సమాచారం.

## ఆ 'నెయ్యి'.. అర్జంటుగా మానెయ్యి..

హైదరాబాద్: పాలు, వెన్న లేకుండానే భారీఎత్తున కల్తీ నెయ్యి తయారు చేసి రాజధానిలో విచ్చలవిడిగా విక్రయిస్తున్న తీరును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్‌ఫాస్ట్), ఆహారభద్రత విభాగం సంయుక్తంగా ఇటీవల 130 తయారీ, విక్రయ కేంద్రాల్లో నిర్వహించిన తనిఖీల్లో 36 టన్నుల కల్తీనెయ్యిని, ప్రమాదకరమైన రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ నెయ్యి రాకెట్ నడుస్తున్న తీరును..నగర సీపీ వీసీ సజ్జనర్ మంగళవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో.. అదనపు సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ విజయ్‌కుమార్, హెచ్‌ఫాస్ట్ డీసీపీ వైభవ్‌గైక్వాడ్, ఇన్‌స్పెక్టర్లు రంజిత్‌కుమార్‌గౌడ్, అంజయ్య, ఎస్సైలు రమ్య, అఖిల్, శంకర్, కృష్ణలతో కలసి.. మీడియాకు వెల్లడించారు. ప్రయోగశాలల్లో పరీక్షించినా.. కల్తీ గుట్టు బయటపడకుండా నిందితులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నారని ఆయన తెలిపారు. బ్రాండ్ లేని.. తక్కువ ధరకు లభించే నెయ్యిని వాడి అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవద్దని వినియోగదారులకు సీపీ సూచించారు. చుక్క కూడా పాలు వినియోగించకుండా.. కేవలం రసాయనాలు, పామాయిల్, రవ్వతో టన్నుల కొద్దీ కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారని డీసీపీ గైక్వాడ్ చెప్పారు. సీపీ మాట్లాడుతూ.. "100 శాతం ప్యూర్, ప్రీమియం, ఫామ్‌ఫ్రెష్, నేచురల్ నెయ్యి తదితర పేర్లతో మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, ఆయుర్వేద మందుల దుకాణాలు, కేటరింగ్ నిర్వాహకులకు సరఫరా చేస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యిలో 99.5 శాతం ఫ్యాట్ ఉండాలి. కల్తీ నెయ్యిలోనూ దాన్ని చూపేందుకు నిందితులు పామాయిల్ వాడుతున్నారు. ల్యాబ్ పరీక్షల ఆధారంగా కల్తీనెయ్యి తయారీలో రసాయనాలు వాడినట్లు నిర్ధారణ అయ్యింది. దీని ఆధారంగా నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కల్తీని పసిగట్టే వీలు లేకుండా.. నిందితులు మహారాష్ట్ర, యూపీ, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడుల నుంచి మిల్క్‌క్రీమ్ దిగుమతి చేసుకుంటున్నారు. దీనికి బొంబాయి రవ్వ, గంజి, పామాయిల్, వనస్పతిలను కలిపి నెయ్యి తయారు చేస్తున్నారు. వాసన కోసం.. కల్తీ అని పసిగట్టే వీలు లేకుండా బీటాకెరోటిన్, ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్, లాక్టిక్ యాసిడ్, మోనోగ్లిజరైడ్స్ వంటి రసాయనాలు కలుపుతున్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

*** జిల్లా కలెక్టర్ కె.హరిత**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా (ప్రజా స్ఫూర్తి): మారుమూల, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. వాంకిడి మండలం ఇందాని గ్రామంలో గ్రాన్యుల్స్ ఇండియా ఫార్మా కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న ఆరోగ్య ఉపకేంద్రానికి మంగళవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రూ.25 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపకేంద్రం



అందుబాటులోకి వస్తే ఇందాని గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు సులభంగా అందనున్నాయని చెప్పారు. మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నాగేంద్ర, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, మండల తహసీల్దార్, ఎంపీడీవో, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ప్రతినిధి లోకేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ నిర్మల, సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో ప్రైవేటు ఉచిత వైద్య శిబిరాలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.వెన్నెల తల్లి పిల్లల ఆసుపత్రి డా" జ్యోత్స్న రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డా"భూక్యా మురళి నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరని అన్నారు.పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమన్నారు.ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్య పరీక్షలు,ఆరోగ్య సూచనలు అందిస్తున్నడా"జ్యోత్స్న రెడ్డి,వెన్నెల తల్లి పిల్లల ఆసుపత్రి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థినులు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్,స్థానిక వార్డు కౌన్సిలర్ బోడ రవి, కౌన్సిలర్ లు బోల్ల రాజు,చిధీరల అరుణ జ్ఞానేశ్వర్ ,పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా నాయకులు,పట్టణ నాయకులు కార్యకర్తలు,వైద్య సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన జాతుల ఐక్యతకి కృషి చేసిన మహనీయుడు పాపన్న గౌడ్



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించిన మహనీయుడు పాపన్న గౌడ్ అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే గొంతుకగా ఉండాలని నేటి యువతకు ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నేలపట్ల వెంకటేశ్వర్లు గౌడ్, బత్తిని సైదులు గౌడ్, బత్తిని మహేష్ గౌడ్, చామకూరి అంజి గౌడ్, పొలంపల్లి సైదులు గౌడ్, పొలంపల్లి అంజి గౌడ్, అనంతు కర్ణాకర్ గౌడ్, చామకూరి మహేష్ గౌడ్, కానుగు గురుస్వామి గౌడ్, నేలపట్ల సుదర్శన్ గౌడ్, అనంతు వెంకన్న గౌడ్, నేలపట్ల సైదులు గౌడ్, కానుగు శివ గౌడ్, చిత్తలూరి శ్రీను గౌడ్, అనంతు మల్లయ్య గౌడ్, విరమళ్ళ వెంకటేష్ గౌడ్, అనంతు సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## భిక్షపతి మరణం కాంగ్రెస్ పార్టీ కి తీరనిలోటు

*** సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బచ్చలకూరి కృష్ణప్రసాద్.**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలం కల్మలచేరువు గ్రామానికి చెందిన కీర్తి భిక్షపతి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని,మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన నికార్సైన కార్యకర్తగా చివరి శ్వాస వరకు పనిచేశారని,బచ్చలకూరి కృష్ణ ప్రసాద్ అన్నారు.ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు "కీర్తి భిక్షపతి" యొక్క పార్థివదేహం పై పూలమాల వేసి నివాళులు తెలిపి,ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బచ్చలకూరి మట్టయ్య,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నట్టే జానకయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లగాని సైదులు,మంగయ్య,వార్డ్ నెంబర్ అమరవరపు నరేష్,శ్రీను,గిరి,సుకన్ రావు, చైర్మన్ శ్రీను, వాడపల్లి సంపత్, సంతోష్, శివ, అరవింద్,అశోక్ మొదలైన వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ జల్దా వెంకటేశం వర్ధంతి వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ లో గాంధీ నగర్ , పరిసర గ్రామాలను స్థాపించిన స్వర్గీయ జల్దా వెంకటేశం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై . మంగళవారం స్వర్గీయ జల్దా వెంకటేశం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది నిరుపేదలకు నిలువ నీడ కల్పించిన ప్రజా నాయకుడు స్వర్గీయ జల్దా వెంకటేశం అని అన్నారు. ఆయన కాలనీకిచేసిన అభివృద్ధిని కొనియాడారు. అనంతరం పేదలకు పండ్లు , బ్రెడ్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జయరాం, ఖాజా మియా, జల్దా లక్ష్మి నాథ్, రంగా శ్రీనివాస్ గౌడ్, ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయికుమార్, నాయకులు ఎర్వ శంకరయ్య, అబ్దుల్ ఖాదర్, ఎల్లయ్య, సుధాకర్, బ్రిజేష్కుమార్, పాషా భాయ్, వాజీద్, హనుమయ్య, శ్రీనివాస్, కమలా బాయి, పద్మ, డివిజన్ పరిధి వివిధ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, మహిళామనులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి


*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం గల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.మంగళవారం మినీ మీటింగ్ హాల్‌లో జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశాన్ని ఇరిగేషన్, వ్యవసాయ, భూగర్భ జలాలు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలోని చెరువుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, ప్రస్తుతం చెరువులలో సుమారు 80 శాతం మేర నీటి కొరత ఉన్న నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా చెరువుల్లోని నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యతపై సమగ్ర వివరాలను సేకరించి, వాటి ఆధారంగా రైతులకు పంటల ఎంపికపై సూచనలు అందించాలని అన్నారు.తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు, గ్రామాల వారీగా నీటి లభ్యతను వివరించి, పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు చూడాలన్నారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, వ్యవసాయ, భూగర్భ జలాలు, ఇరిగేషన్ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

*** జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా (ప్రజా స్ఫూర్తి):గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానించడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్-తట్టుగూడెం మధ్య రూ.8.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ వంతెనకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపొర్లిన సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులకు ఈ వంతెన నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. వంతెన పూర్తయితే కాగజ్‌నగర్, వాంకిడి ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మెరుగుపడి, ప్రజలు సమీప పట్టణాలు, మార్కెట్లు, విద్యా సంస్థలు, ఆసుపత్రులకు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యుడు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, కాగజ్‌నగర్ ఆర్డీవో చెన్నూరి కిష్టయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, మున్సిపల్ చైర్మన్లు ఆకాష్, సహిన్ సుల్తానా, మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, దేవయ్య, ఆర్‌అండ్‌బీ మరియు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శం

*** రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చూపిన పోరాట పటిమ, ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బుద్దా విజయ్ శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376 వ జయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం చింతల్ డివిజన్, భగత్ సింగ్ నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ శ్రీ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలలో ఆయన తో పాటు భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాపరెడ్డి, మాజీ అధ్యక్షుడు టి అశోక్, మాజీ వైస్ చైర్మన్ జయరాం లు ముఖ్యఅతిథిలుగా హాజరై పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక పాపన్న గౌడ్ మహారాజ్ అని అన్నారు. తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, దొరల అరాచకాలను, మొగులాయి దౌర్జన్యలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడికి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయ, సామాజిక సమానత్వం, కుల, మతాల వివక్ష లేకుండా సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తి తో ఆనాటి కాలంలోనే పోరాడిన యోధుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు బబ్బూరి బిక్షపతి గౌడ్, సలహాదారులు బాల్నే రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు, జై గౌడ్ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి బీసు వెంకటేశం గౌడ్, కోశాధికారి బత్తిని శ్రీధర్ గౌడ్, కార్యదర్శి మడ్డి వెంకటేశ్వర్లు గౌడ్, బి రాఘవేంద్ర స్వామి గౌడ్, పూర్ణచందర్ గౌడ్, రాఘవులు, మిక్సర్ రాములు, ఎం.నరసింహ, కె.నాగరాజు, చంద్రమౌళి, జాను, మోడం రాజు గౌడ్, బి యాదగిరి గౌడ్, గంటే వెంకటేష్ గౌడ్ , వై రవి గౌడ్, గంటే నరేందర్ గౌడ్, లింగం గౌడ్, గడ్డం సతీష్ గౌడ్, గంటె సాయి గౌడ్ , బాలు నేత, గటోజ్ సతీష్ , భీమగోని అశోక్ గౌడ్, శ్యామలమ్మ, లక్ష్మమ్మ ,సుబ్బమ్మ, తదితరులు హాజరై పూలమాలవేసి నివాళులర్పించారు

## ఈనెల 19న సూర్య భగవాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : నేరేడ్మెట్‌లోని శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయంలో ఆగస్టు 19న సూర్య భగవాన్ విగ్రహ ఆవిష్కరణ, ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.ఉదయం 7:15 గంటలకు ప్రారంభమయ్యే ఈ పవిత్ర కార్యక్రమాన్ని శ్రీ శ్రీ శ్రీ విద్యాశంకర భారతి స్వామివారి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సూర్య భగవానుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.



## మల్కాజిగిరి బీఆర్ఎస్ కు బిగ్ షాక్

*** కాంగ్రెస్‌లోకి మాజీ కార్పొరేటర్ వర్గీయులు**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్‌తో కలిసి పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ జి. కృష్ణగౌడ్, జి. జగమేష్ గౌడ్, జి. ఎల్లేష్, కె. శ్రీనివాస్‌రెడ్డి, ఏ. శ్రీనివాస్‌గౌడ్, మొగెందర్, దేవి, ఈశ్వర్, బాలరాజ్, సూరి, మల్లారెడ్డి, సాయి చారి, షేక్ అబ్బాస్, అబ్బన్న, నరసింహ, స్వామికుమార్, సైదులు, రాజు, విక్రమ్, రాజేష్, బోర్‌వెల్ శ్రీనివాస్, వెంకట్, రాజ్, లక్ష్మణ్ నాయక్ తదితరులు కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు కొత్తగా చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

## ముధోల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై బీఆర్ఎస్ ధర్నా



ప్రజాస్ఫూర్తి , భైంసా: నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకురాలు డా. పడకంటి రమాదేవి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాల ద్వారా లబ్ధి పొందాల్సిన కుటుంబాలు పెండింగ్ చెల్లింపులతో ఇబ్బందులు పడుతున్నారని డా. పడకంటి రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు.పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం ప్రయోజనం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఇదిలా ఉండగా,కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెల్లింపులకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు చెల్లింపులపై నిలుపుదల కొనసాగుతున్న విషయం తెలిసిందే. పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది అని డా.పడకండి రమాదేవి పేర్కొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి, భైంసా : విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటీలోని సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి) హైదరాబాద్ భాగస్వామ్యంతో నిర్వహించిన సెమికండక్టర్ డిజైన్ లపై ఐదు రోజుల ప్రత్యేక వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సెమికండక్టర్ తయారీ, డిజైనింగ్ లకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ రంగాలు అత్యంత కీలకమైనవని అన్నారు. ఐఐఐటీ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ లభించడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు. విద్యార్థులకు బయట సమాజంలో ఉన్న అవకాశాలను వివరించి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఏ విషయమైనా కూడా అధ్యాపకులను అడిగి విషయావగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి విషయాన్ని లోతుగా విశ్లేషించుకొని, క్షుణ్ణంగా అర్థం చేసుకున్నప్పుడు అంశాలపై పట్టు సాధించవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, ఎన్ఐఈఎల్ఐటి హైదరాబాద్ ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్ కోర్ర, ఓఎస్డి మురళీ దర్శన్, ఐడెక్స్ మాజీ డైరెక్టర్ కల్నల్ (రిటైర్డ్) ఎ.కె. సింగ్, వీర టాక్టికల్ డైనమిక్స్ సీఈఓ సాయి తేజ, క్యూక్లైర్వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ వి.పి. సేల్స్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ మేనేజర్ బుంగ వెంకటరమణ ఔదార్యం

*** ప్రభుత్వ హైస్కూల్ కు వాటర్ ప్లాంట్ ఏర్పాటు**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం: చుంచుపల్లి మండల పరిధిలోగల రుద్రంపూర్ గ్రామంలో గల ఎస్ బిఐ బ్యాంక్ మేనేజర్ బుంగ వెంకటరమణ గ్రామంలో గల ఉన్నత పాఠశాల విద్యార్థుల మంచినీటి అవసరం కొరకు తన సొంత ఖర్చులతో 26 వేల రూపాయలు విలువ చేసే కమర్షియల్ మినరల్ వాటర్ ప్లాంట్ ను పాఠశాల హెచ్ఎం బాలాజీ సమక్షంలో గ్రామ సర్పంచ్ కేస్లీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ బుంగ వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం సామాజిక బాధ్యతగా భావించాలని , విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ సమయానికి పోషకాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకొని , ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని మంచిగా చదువుతూ ఉన్నత స్థానానికి వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు . అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మేనేజర్ సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం , పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు .

# ఉత్తమ పంచాయతీ కార్యదర్శి గా ప్రశంసా పత్రం అందుకున్న సాంబయ్య



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : లక్ష్మీదేవి పల్లి మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న సాంబయ్యకు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ప్రగతి మైదానంలో నిర్వహించిన వేడుకలలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరుస్తూ , ప్రజలకు మెరుగైన సేవలు అందించినందుకు గాను ఉత్తమ కార్యదర్శిగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో సత్కరించారు ఉత్తమ కార్యదర్శిగా ప్రశంసా పత్రం అందుకున్న కార్యదర్శి సాంబయ్యను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ అంకిత్ , ఎస్పీ రోహిత్ రాజ్ , పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు .

# భైంసాలో ఘనంగా 376వ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని గురుకృపా వొకేషనల్ కాలేజీలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డా. ముష్కం రామకృష్ణ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భైంసా మున్సిపాలిటీ చైర్మన్ తూమొల్ల దత్తు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, సుభాష్,అడ్వకేట్ ప్రవీణ్ కుమార్,తెలంగాణ గౌడ సంఘం నాయకులు గంగాధర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,బిజెపి నాయకులు భోస్లే బాజీరావు పటేల్, డా. మహిపాల్,హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండపు కాశీనాథ్ పెద్ద సంఖ్యలో ప్రజలు, యువత, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదేశాలతో వందలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వై వెంకటేశ్వర్లు, పెరుమాళ్ళ అన్నపూర్ణ, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జీడి భిక్షం, కౌన్సిలర్ లు ఆంగిరేకుల నాగార్జున, తహేర్ మునీర్, సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులు, ఆకుల లవకుశ, పుట్ట కిషోర్, తహెర్ పాషా, బత్తుల రమేష్,బత్తుల జాని, రేణు బాబు, కొండపల్లి సాగర్ రెడ్డి, గండూరి కృపాకర్, చిరివెళ్ల శభరినాథ్, రియాజుద్దిన్, కరుణశ్రీ, సల్మా మస్తాన్, డిల్లి పావని తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండను సమస్యలు లేని పట్టణంగా అభివృద్ధి చేస్తాం

*** పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: నల్గొండ పట్టణంలో సిసి రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు ఇలా అన్ని సదుపాయాలను కల్పించి సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు.ముందుగా మంత్రి 3 వ డివిజన్లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా, అద్దంకి రహదారి వరకు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పానగల్ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి డీఈఓ కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వన్ టైం ఇంప్రూవ్మెంట్ కింద 14.45 కోట్ల రూపాయల తో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఆయా డివిజన్ లలో మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, పట్టణానికి బయట 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డును చేపట్టడం జరిగిందని, పట్టణంలో 500 కోట్లతో చేపట్టిన సిసి రహదారులు, డ్రైన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, మారుమూల శివారు ప్రాంతాలను కలుపుకొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో రహదారుల ఏర్పాటుతోపాటు, సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ ,విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలని కల్పిస్తున్నామని, పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేలా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 83 కోట్ల రూపాయలతో వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయగా, నెల రోజుల్లో ఆ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించే పనులు శరవేగంగా నడుస్తున్నాయన్నారు. నల్గొండ ను సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. తెలంగాణలోనే మొదటి కళాశాల గా పేరుపొందిన ఎన్జీ కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. సంఘంలో లేని మహిళలు కొత్త సంఘాలుగా ఏర్పాటు కావాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన వల్ల పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలకతీతంగా నల్గొండ కార్పొరేషన్ ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని, పట్టణంలో రహదారుల ఏర్పాటుతో పాటు, డివైడర్లు ,సెంట్రల్ లైటింగ్, హైమాస్ లైటింగ్, సుందరీకరణ వల్ల పట్టణానికి మరింత శోభను తీసుకొస్తుందని అన్నారు. కార్పొరేటర్లు మల్లీశ్వరి, బొడ్డుపల్లి లక్ష్మి ,కవిత, వేణు, తదితరులు మాట్లాడారు.డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఆర్ డి ఓ అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం, డిటిడిఓ, ఏసీఎస్ డైరెక్టర్ నాగరత్నం, కార్పొరేటర్లు స్వాతి, కవిత, జాతీయ రహదారి అధికారులు, తదితరులు ఉన్నారు.

# కలెక్టరేట్లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , భైంసా : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన త్యాగాలు, సేవలను నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు అమరవేణి నర్సగౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాలు గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఆయన తెగువ నేటి తరాలకు ఆదర్శమని తెలిపారు.ఈ జయంతి వేడుకల్లో డిఆర్ఓ రాథోడ్ రమేష్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సి కార్పొరేషన్ శంకర్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు, కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

*** జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాల్, వంటశాల, విద్యార్థుల వసతి గదులను స్వయంగా పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా ప్రమాణాలను, అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. తాగునీటి శుద్ధి ప్లాంట్,పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు.విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ ఇనుగుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూ విద్యార్థులతో కలెక్టర్ ఆత్మీయంగా ముచ్చటించారు. నిత్యం అందుతున్న ఆహార నాణ్యత,పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు,హాస్టల్ వసతులపై అడిగి తెలుసుకున్నారు.ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష, ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎన్హెచ్బి పథకాలతో ఉద్యాన రైతులు అధిక ఆదాయం పొందాలి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : కృషి విజ్ఞాన కేంద్రం (ఐసీఎఆర్), గడ్డిపల్లి ఆధ్వర్యంలో, నేషనల్ హార్టికల్చర్ బోర్డ్ (ఎన్హెచ్బి), హైదరాబాద్, వ్యవసాయ , రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సహకారంతో ఎన్హెచ్బి పథకాలు , బ్యాంకు అనుసంధానిత బ్యాక్ ఎండెడ్ సబ్సిడీపై శిక్షణ - అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎన్హెచ్బి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని, ఉద్యాన రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబిస్తూ అధిక ఆదాయం పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త & హెడ్ డా. డి. నరేష్ తెలిపారు.ఈ కార్యక్రమానికి నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డీడీఎం) డి. రవీంద్ర నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూర్యాపేట జిల్లా డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ జి. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా అధిక విలువ కలిగిన ఉద్యాన పంటలను సాగు చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు. ఎన్హెచ్బి డిప్యూటీ డైరెక్టర్, హైదరాబాద్ ఎస్. జోషి భీమా మాట్లాడుతూ ఎన్హెచ్బి పథకాల కింద అందుబాటులో ఉన్న సబ్సిడీ, అర్హతలు, ప్రాజెక్టు ప్రతిపాదన, బ్యాంకు రుణం , సబ్సిడీ పొందే విధానాలను రైతులు పూర్తిగా అర్థం చేసుకుని, నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెక్నికల్ హార్టికల్చర్ ఆఫీసర్ ఎం. మహేష్ మాట్లాడుతూ ఆధునిక ఉద్యాన సాంకేతికతలను అవలంబించడం ద్వారా ఉత్పాదకత, నాణ్యత మరియు రైతుల ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి ఉద్యాన శాస్త్రవేత్త సీ.హెచ్. నరేష్ మాట్లాడుతూ రైతులు ఎన్హెచ్బి పథకాలతో పాటు శాస్త్రీయ ఉద్యాన సాగు పద్ధతులను అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఏ. కిరణ్, డా. పి. అక్షిత్ సాయి, ఎన్. సుగంధితో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఐలయ్య నియామకం

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చెవిటి ఐలయ్య నియమితులయ్యారు.ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చెవిటి ఐలయ్య మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, బీజేపీ మానుకోట జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, బీజేపీని మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని ఐలయ్య పేర్కొన్నారు.

# అక్రమంగా కల్తీ ఖోవాను రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు



వికారాబాద్ , ప్రజాస్ఫూర్తి : కల్తీ ఖోవాను అక్రమ రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని తాండూర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 174 కిలోల కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో కల్తీ ఆహార పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా , టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్న రాజస్థాన్ రాష్ట్రం నాగౌర్ జిల్లా మక్రానా మండలం ఉంచెరియా గ్రామానికి చెందిన రుపారామ్ (36) ని జహీరాబాద్ పట్టణంలోని పాష్తాపూర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అయితే అతను ఆటోలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన రైడ్‌లో అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 160 కిలోల కల్తీ ఖోవా, 14 కిలోల కలకన్, మొత్తం 174 కిలోల ఆహార పదార్థాలను, సుమారు రూ.34,800/ విలువైనవి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా అనుమానాస్పదంగా కల్తీ ఆహార పదార్థాల రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి" అని అని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ స్వాధీనం చేసుకున్న కల్తీ ఆహార పదార్థాలు, ఆటో, నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం తాండూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

# భువనగిరి ఆలేరు ప్రజల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం

*** ప్రభుత్వ విప్ప బీర్ల ఎమ్మెల్యే కుంభం**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.210 కోట్ల వ్యయంతో మల్లన్నసాగర్ నుంచి భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు తాగునీటిని తరలించే పైప్‌లైన్ నిర్మాణ పనులను మంగళవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభంఅనిల్ కుమార్ రెడ్డి ఘనపూర్ గుట్ట వద్ద పైప్ లైన్ పనులని పరిశీలించారు.ఈ సందర్భంగా ఘనపూర్ గుట్ట వద్ద జరిగిన సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పైప్‌లైన్ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రాజెక్టుకు అవసరమైన 4.5 కిలోమీటర్ల అటవీ ప్రాంతానికి సంబంధించిన అనుమతులను ప్రభుత్వం ఇప్పటికే పొందిందని వారు తెలిపారు. మిగిలిన పనులను వేగవంతం చేసి, ప్రజలకు త్వరితగతిన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రూ.210 కోట్లతో ఈ ప్రతిష్టాత్మక పైప్‌లైన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. మల్లన్నసాగర్ నీటిని భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు తీసుకురావడం ద్వారా వేలాది కుటుంబాలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషాకృష్ణారెడ్డి,కౌన్సిలర్లు భువనగిరి, ఆలేరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మిషన్ భగీరథ సీఈ రాంచంద్రనాయక్, ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం

* **విద్యార్థులకు 700నోట్ బుక్స్ పంపిణీ**



కూసుమంచి,ప్రజా స్ఫూర్తి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చేతన ఫౌండేషన్ నుంచి కూసుమంచి ప్రాథమిక పాఠశాల, కూసుమంచి ఎస్సీ కాలనీ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన 700 నోటుబుక్స్ కూసుమంచి ఎంఈఓ రాయల వీరస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేతన ఫౌండేషన్ ముఖ్య సభ్యుడు ముత్తినేని సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం సుమారు 20వేల రూపాయల విలువైన నోట్ బుక్స్ అందిస్తున్నామని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవాలని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. గతంలో తమ ఫౌండేషన్ ద్వారా కూసుమంచి ఉన్నత పాఠశాలకు 2లక్షల రూపాయల విలువైన ఎల్ఈడి టీవీ అందించామని, కరోనా సమయంలో నిరుపేద విద్యార్థులకు లక్ష రూపాయల విలువైన 100స్కూల్ బ్యాగ్ కిట్స్ అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాయల వీరస్వామి మాట్లాడుతూ చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయమని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకొని కష్టపడి చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండా కృష్ణవేణి, ఎస్సీకాలనీ పాఠశాల హెచ్ ఎం భాస్కర్, పాఠశాల సిబ్బంది, చేతన ఫౌండేషన్ సభ్యులు సంతోష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వలిగొండలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండల కేంద్రంలో మంగళవారం గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు కొండూరు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశే సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, కొండూరు వెంకటేశం, బంధారపు లింగస్వామి, బత్తిని దేవేందర్, పబ్బు స్వామి, బత్తిని నరసింహ, పంజాల రమేష్, కాసుల పెద్దలు, పబ్బు మల్లయ్య, కొండూరు సత్తయ్య, బత్తిని అరుణ్, కొండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

**దాసిరెడ్డిగూడెంలో**

అదేవిధంగా మండలంలోని దాసిరెడ్డిగూడెం ఇంకా తదితర గ్రామాలలో కూడా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దాసిరెడ్డిగూడెం గ్రామంలోని పాపన్న విగ్రహానికి పూలమాల లు వేశారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బంధారపు లింగస్వామి, బాలగోని బిక్షపతి, దంతూరి దుర్గయ్య, బాలగోని సత్తయ్య, మల్లయ్య, గోదా అచ్చయ్య, బందారపు రాములు, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

- **తంగడపల్లి లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మదిన వేడుకలు**
- **బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొయ్యడ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన సేవలను కొనియాడారు. పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను, ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, ఆలే శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల, గుండంపల్లి గ్రామాల్లో పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ పర్యటన


ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల, దిలావార్పూర్ మండలం గుండంపల్లి గ్రామాల్లో పంచాయతీ రాజ్ పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన ఫామ్ పాండ్ పనులను డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పలువురు గ్రామస్తులకు చెత్తబుట్టలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలెవరు చెత్తను బయట పారవేయకుండా, చెత్త బుట్టలో వేసి చెత్త వాహనాలకు అందించాలని అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని తెలిపారు. స్టీల్ బ్యాంక్ ను పరిశీలించారు. అనంతరం గుండంపల్లి గ్రామంలో పర్యటించారు. అధికారులతో



కలిసి గ్రామంలోని ఫామ్ పాండ్, ఫిష్ పాండ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ, పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనులన్నీ సకాలంలో పూర్తిచేశాల చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టిన వివిధ పనుల గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి పథకాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో డిపిఓ శ్రీనివాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఈఈ ఆర్డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నాకు భూమి ఇప్పించి న్యాయం చేయండి

* **నష్ట పరిహారం డబ్బులు ఇప్పించండి.**
* **హుస్నాబాద్ ఆర్డీవోకు వృద్ధురాలి వేడుకోలు.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : నా భూమి నాకు ఇప్పించి న్యాయం చేయాలని, నా భర్త పేరు మీద ఉన్న భూమిని అక్రమంగా మా పెద్ద కుమారుడు జూపల్లి రాజేశ్వరరావు అక్రమంగా పట్టా చేయించుకున్నాడని అతను తర్వాత తన భార్య జూపల్లి అంజలీదేవి పేరు మీద విరాసాత చేయించాడని నాకు ఇద్దరు కుమారులని అందులో చిన్న కుమారుడు జూపల్లి చంద్రశేఖర రావు ఉన్నారని అయితే మొత్తం భూమిని పెద్ద కుమారుడే అనుభవిస్తున్నాడని చిన్న కుమారుడు పేరు మీద కూడా వాటా రాలేదని అక్కన్నపేట మండలం తోటపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు జూపల్లి భారతమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. రెండు ఎకరాల 10 గుంటల భూమి మొత్తం ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు లో పోయిందని దాంట్లో భాగంగా నాకు రావాల్సిన భూమి నాకు ఇప్పించగలరని, ఆమె విలేకరుల ముందు బోరున విలపించారు. వృద్ధాప్యంలో నా బాగోగులు ఎవరు చూడడం లేదని కాస్త చిన్న కుమారుడు చంద్రశేఖర రావు మాత్రమే మానవతా దృక్పథంతో చూస్తున్నాడని ఆ వాటా పూర్తిగా నాకు గాని నా చిన్న కుమారుడు గాని బదిలాయించాలని ఆమె అన్నారు. ఇండస్ట్రియల్ పార్కులో భాగంగా నష్టపరిహారం కింద 18 లక్షల రూపాయలు ఎకరం చొప్పున వచ్చాయని ఇట్టి డబ్బులు పెద్ద కుమారుడి భార్య మాత్రమే అనుభవిస్తుందని ఇందులో మాకు కూడా వాట ఉందని ఆమె ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అన్యాయంగా నా భూమి నాకు తెలవకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అట్టి భూమిని మళ్లీ నాకు చెందే విధంగా పూర్తి విచారణ జరిపి నాకు న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# బీటెక్ ఫలితాలలో శ్రీ చైతన్య ప్రభంజనం

ప్రజా స్ఫూర్తి, పాలేరు : మంగళవారం శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల అటానమస్ మొదటి సంవత్సర రెండవ సెమిస్టరు పరీక్ష ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె లక్ష్మి నారాయణ విడుదల చేసారు. ఈ ఫలితాలలో, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థి జంపాని ఆకాంక్ష 9.7, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ విభాగ విద్యార్థి తూము సంతోష్ 9.55ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థి బానోత్ కీర్తి ప్రియా 9.4, ఈసీఈ విభాగ విద్యార్థి అఖిల్ పొనుగోటి 9.4, సివిల్ ఇంజనీరింగ్ లో మాతంగి వనిత 9.29, మెకానికల్ ఇంజనీరింగ్ లో తేజావత్ సంజు 9.29, డేటా సైన్స్ విద్యార్థి తాళ్లపల్లి బానుష్ 9.1 ఇంజనీరింగ్ తో యూనివర్సిటీ స్థాయిలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించారని, 9.0 ఎస్ జి పి ఎ కి పైన 78 మంది విద్యార్థులు ఫలితాలు సాధించారు అని చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, అధ్యాపకులు రూపొందించిన ప్రాక్టికల్ ఆధారిత మైక్రో షెడ్యూల్ తో పాటు ప్రతి సబ్జెక్టులో బోధనతో సమానంగా ప్రాక్టికల్ శిక్షణను అందించడం వల్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలిగారని తెలిపారు. ఈ





ఫలితాలు యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమమైనవిగా నిలవడం కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, విద్యార్థులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ వారి ప్రతిభను వెలికితీయడమే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. నాణ్యమైన బోధన, అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల కృషి , తల్లిదండ్రుల సహకారమే ఈ అద్భుత ఫలితాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, విద్యార్థుల విజయం కృషి, పట్టుదల, నిరంతర సాధన ద్వారానే సాధ్యమవుతుందని అన్నారుకళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ వి. సుదర్శన్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయాల్లో అధ్యాపకుల పాత్ర కూడా ఎంతో కీలకమని అన్నారు. సిలబస్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులకు ఎప్పటికప్పుడు నిపుణులచే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధునిక బోధనా విధానాలను అమలు చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంట్రోల్ ఎగ్జామినేషన్ డాక్టర్ వి నర్సిరెడ్డి ,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత , వివిధ విభాగాల అధిపతులు అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి..

* **అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, బడుగు-బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. జానయ్య, నాయకులు అమరగాని వెంకన్న గౌడ్, కత్తి నెహ్రూ గౌడ్, పోలంపల్లి నాగరాజు గౌడ్, బండి నాగేశ్వరరావు గౌడ్, గజ్జెల్లి వెంకన్న, నూతి సత్యనారాయణ గౌడ్, పూడుగు శ్రీనివాస్ గౌడ్, బొలిగాని శ్రీనివాస్ గౌడ్, బిచ్చాల తిరుమలరావుగౌడ్, మారగాని సుదర్శన్ గౌడ్, బెల్లంకొండ శరత్ గౌడ్, మూడు ముంతల గంగరాజు గౌడ్, కొమిలి శ్రీనివాస్ గౌడ్, జి. శ్రీనివాసరావు, మార్కం లింగయ్య గౌడ్, దాసరి శ్రీరాములు గౌడ్, అల్లిక అంజయ్య, పగడాల నాగరాజు, గుడిద శ్రీనివాస్, వట్టికూటి ఉమాదేవి, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, రుద్ర ప్రదీప్, మొక్క శేఖర్ గౌడ్, బిసి కుల సంఘ నాయకులు, వెనుకబడిన తరగతుల కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు న్యాయం జరగాలంటే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ రద్దు చేయాలి

* **టిడబ్ల్యూయంఎఫ్ జిల్లా ఇన్చార్జ్ గుండా ఉపేందర్ రెడ్డి**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండల కేంద్రంలో టిడబ్ల్యూయంఎఫ్ మండల ఇన్చార్జి కర్ల రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల గురించి వార్డు సభ్యులు చర్చించారు. తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం (టీ డబ్ల్యు యం ఎఫ్) జిల్లా ఇన్చార్జి గుండా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో స్థానిక ఎన్నికలు జరగకపోవడం వలన స్థానిక ప్రజా ప్రతినిధులు లేకపోవడం వలన ప్రభుత్వం జీవో నెంబర్ 33 ద్వారా ఇందిరమ్మ ఇళ్లు కమిటీ తీసుక వచ్చింది. ఆ కమిటీలో మెజార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉండటం వలన అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎటువంటి న్యాయం జరగలేదు. ఇప్పుడు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రతి గ్రామంలో వార్డు సభ్యులు ఉన్నందున గత జీవో నెంబర్ 33 రద్దుచేసి స్థానిక ప్రజా ప్రతినిధులు అయినా వార్డు సభ్యులకు ఇందిరమ్మ ఇల్లు ఎంపిక బాధ్యత ఇవ్వవలసిందిగా కోరారు. వార్డు సభ్యులకు మాత్రమే తమ వార్డులో పేదలను గుర్తించటం జరుగుతుందన్నారు. అర్హులు ఐన పేదలకు న్యాయం జరగాలంటే కేవలం అది వార్డు సభ్యుల ద్వారా మాత్రమే జరుగుతుందన్నారు. జీవో నెంబర్ 33 ద్వారా ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక జరిగితే అర్హులైన పేదలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా స్థానికంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్నికైన వార్డు సభ్యులను గౌరవించి వారికి ఇందిరమ్మ ఇళ్లు కమిటీలో సభ్యులుగా చేర్చవలసిందిగా కోరారు. లేని యెడల ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వార్డు సభ్యులు అందరూ కలిసి కమిటీ రద్దు అయ్యేంతవరకు పోరాడుతామన్నారు. తమ న్యాయపరమైన హక్కులను సాధించుకుంటామని తెలియజేశారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, ఐతగాని నవీన్, అర్వపల్లి ఉపేందర్ గౌడ్, మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన యోధుడు.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- **మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు**
- **చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బహుజనుల హక్కుల సాకారమే ధ్యేయంగా పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ కొనియాడారు. చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన బహుజన వీరుడు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజయ్య, కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, ఊదరి యాదయ్య, కొయ్యడ శేఖర్ గౌడ్, బద్రి గాలయ్య, పాక చిరంజీవి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, కోఆప్షన్ సభ్యుడు పస్తం గంగా రాములు, నాయకులు ఊడుగు రమేష్, సందగళ్ళ సతీష్ గౌడ్, బత్తుల దాసు, షేక్ జానీ బాబా, పల్లె సురేందర్ రెడ్డి, వివిధ రంగాల గౌడ సంఘ ప్రముఖులు, గౌడ సంఘ యువజన నాయకులు, మున్సిపల్ కార్యాలయ వార్డ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ అదుపులో నల్లమల అటవీ అధికారులు

లింగాల: నల్లమల అడవి నుంచి వ్యవసాయ సామగ్రికి సంబంధించిన కలపను తీసుకెళ్తున్న ముగ్గురు రైతుల నుంచి డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలపై ఇద్దరు అటవీ అధికారులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ కథనం ప్రకారం.. జులై 23న లింగాల అటవీశాఖ పరిధిలోని కొర్రమడుగు అడవి నుంచి మూడు ఎడ్ల బండ్లపై రైతులు కలపను తీసుకెళ్తుండగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాంబాబు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మురళీకృష్ణ అడ్డుకున్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బంది నీ పర్మినెంట్ చేయాలి

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి :గరిడేపల్లి మండలంలోని జిపి వర్కర్స్ గరిడేపల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు తమ సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేయడం జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు ఎస్ కే యాకూబ్ మాట్లాడుతూ కార్మికులకు సర్వీస్ పర్మినెంట్ చేసి వేతనాలు పిఆర్సి ప్రకారం అమలు చేయాలి తదితర సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడం జరిగింది అని యాకూబ్ తెలిపారు రాష్ట్రంలో 12 వేల 760 గ్రామపంచాయతీలో సుమారు 53,000 మంది గ్రామపంచాయతీ ఉద్యోగులుగా కార్మికులు పనిచేస్తున్నారు గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అంటూ వ్యాధులు రాకుండా ఆరోగ్య అనారోగ్యాలు రాకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పంచాయతీ కార్మికులు సేవలందిస్తున్నారని అన్నారు పారిశుద్ధ్య కార్మికులకి ఏళ్ల తరబడి పనిచేసిన పనికి భద్రత ఫర్మెంటు కనీస వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాక కార్మికులు వీధులలో పడే పరిస్థితులు ఉన్నాయని అన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం ఇస్తానని ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించినప్పటికీ అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా సమస్యను గుర్తించి కనీస వేతనం అమలుకై



ప్రభుత్వం ముందుకు రావాలని లేని ఎడల రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని యాకూబ్ అన్నారు ఈ కార్యక్రమంలో జిపి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొండ సైదులు ఉపాధ్యక్షులు మచ్చ వీరస్వామి గౌరవ అధ్యక్షులు గోపగాని సత్యం సహ కార్యదర్శి రావుల వెంకన్న రామారావు కే శ్రీనివాసరావు జానయ్య గోపాలకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు ఉట్టికూటి వెంకన్న సిద్దయ్య మహేష్ సీతమ్మ మరియమ్మ నందిపాటి మహేష్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# 'నారాయణ'లో ఘనంగా బోనాల వేడుకలు




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ పట్టణం నెహ్రూనగర్‌లోని నారాయణ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకల్లో అమ్మవారి వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా 3వ తరగతి విద్యార్థిని కోమలి అమ్మవారి వేషధారణ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారుల సాంప్రదాయ వేషధారణలు, పోతరాజు వేషధారణలు, ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకువచ్చాయి. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు తెలంగాణ బోనాల పండుగ వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించాయి. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల ఖమ్మం ఏజీఎం రాంకీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన, గౌరవభావాలను పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూరేటి నరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం బోనాల పండుగను తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా నిర్వహిస్తోందన్నారు. బోనం అంటే భోజనం అని అర్థమని, ఆషాఢ మాసంలో అమ్మవారికి భోజనాన్ని నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈ-చాంప్స్ వీపీ శైలజ, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ వినోద, ఉపాధ్యాయులు అలియా, కళ్యాణి, శ్రీలత, సరస్వతి, దీప్తి, ఉషా, జాహ్నవి, శివజ్యోతి, ప్రియ, సాగరిక, ఏవో వీర, పీఈటీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మంజూరైన రోడ్ల పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్కకు వినతి



ప్రజాస్ఫూర్తి, భైంసా : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కలిసి పలు సమస్యలను విన్నవించారు. హమ్ పథకంలో మంజూరైన రోడ్ల పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయని, గత ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఇకనైనా రోడ్ల నిర్మాణాలు చేపట్టి రవాణా మార్గాన్ని మెరుగుపరచాల్సిందిగా కోరారు. కొన్నిచోట్ల డబుల్ లైన్ రోడ్లు వేయాల్సిందిగా వినతి పత్రంలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిపై, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధిపై వారిద్దరి మధ్య చర్చ జరిగింది. అదేవిధంగా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో బంజారాల కోసం ఒక ఎకరం స్థలాన్ని ఇవ్వాలని కోరారు. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరకు దేశ నలుమూలల నుండి గిరిజనులు వస్తారని, వారి సౌకర్యార్థం సేవాలాల్ మహారాజ్ సంఘ భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.అయన వెంట నాయకులు సాంప్లీ రమేష్ తో పాటు పలువురు ఉన్నారు.

## పిఆర్ టియు ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దుకై ఎంపీకు వినతి పత్రం



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పిఆర్టియు జిల్లా అధ్యక్షులు రవి , అసోసియేట్ అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో మహబూబాద్ ఎంపీ బలరాం నాయక్ ను కలసి ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా పి ఆర్ టి యు నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ ను వెంటనే రద్దు చేయాలని , కస్తూర్బా , గురుకులాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని తదితర ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర రావు , జిల్లా బాధ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు .

## బంజారాల ఆచారాలు, సాంస్కృతికి నిలయం తీజ్ ఉత్సవాలు

**: ఎమ్మెల్యే కూనంనేని**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బంజారాల ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయం తీజ్ ఉత్సవాలు అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో నిర్వహిస్తున్న తీజ్ వేడుకల్లో మంగళవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా పండేందుకు భారత దేశంలో ప్రతీ ఒక్కరికి ఒక ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు ఉన్నాయని, వాటిని భవిష్యత్ తరాలకు అందించేందుకు పాటుపడాలన్నారు. వివాహం కాని యువతులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా సాధులకు ఎమ్మెల్యే చేతులమీదుగా సన్మానం చేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలకు వందల ఏళ్ల చరిత్ర ఉందన్నారు. వాటిని కాపాడుకోవం బంజారాలు బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు ధరావత్ కాన్షీరామ్, బానోత్ రమేష్, గుగులోత్ భద్రు, భూక్య శ్రీనివాస్, ధరావత్ కృష్ణ, జాటోత్ భరత్, నూనావత్ రవి, రమేష్ రాథోడ్, బానోత్ రాములు, రవి, భూక్య మోతిలాల్, బానోత్ హీరాలాల్, కున్సోత్ ప్రసాద్, భూక్య బాబులాల్, సపావట్ బాలకృష్ణ, జె.బి. బాలు, లావుడ్య హన్మంతు, సాధు సంత్‌లు, గురువులు ధరావత్ నర్సింహా, బాలు, సోషల్ మీడియా ఇన్‌చార్జి వినోద్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని సూర్యాపేటలో నెలకొల్పాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: మొగల్ పాలకుల కాలంలో ఆత్మగౌరవం, స్వరాష్ట్ర సాధన కోసం గళమెత్తి పెద్ద ఎత్తున పోరాటం చేసిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మదినం సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం ఎదురుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నాలుగు శతాబ్దాల క్రితమే పెద్ద పెద్ద కోటలనిర్మాణం చేశారని, సూర్యాపేట పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం నెలకొల్పాలని ఆయన చరిత్రను పాఠ్యపుస్తల ద్వారా విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, పట్టణ నాయకులు వై.వెంకటేశ్వర్లు, చింతలపాటి చిన్న శ్రీరాములు,బైరు వెంకన్న, గుణగంటి వంశి, జీడి భిక్షం, కౌన్సిలర్ బైరు శైలేందర్ , అంగిరేకుల నాగార్జున, ఆకుల లవకుశ, ధర్మార్జున్, బూర బాలసైదులు, బొమ్మగాని శ్రీనివాస్, మందడి డేవిడ్ కుమార్, పందిరి మల్లేష్, చల్లమల్ల నరసింహ, పాండు రంగా చారి, తల్లమల్ల హసేన్, కక్కిరేణి సత్యనారాయణ, శనగాని రాంబాబు గౌడ్, అంతటి విజయ్, అనంతుల మధు, సాజిద్, బొల్లెద్దు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయొద్దు

* **ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి వినయ్**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడటం తగదని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ ధ్వజమెత్తారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేయడాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీ ముసుగులో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల ఆస్తులను ప్రైవేటీకరించడం పూర్తిగా అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాసే అర్హత కోల్పోయి, కార్పొరేట్ కంపెనీల్లో తక్కువ వేతనాలకే పనిచేసే పరిస్థితులు దాపురిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమా విద్యార్థులకు ఎంతో కాలంగా అమల్లో ఉన్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ కమిటీ సభ్యులు సలిగంటి జయదీప్, రామ్ చరణ్, సాయి రామ్, వడ్డేబోయిన యశ్వంత్, ముదిగొండ నిరీక్షణ, సన్నీ, స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఫతే దర్వాజాలో మూడంతస్తుల భవనంలో మంటలు

* **హైదరాబాద్ పాతబస్తీ ఫతే దర్వాజాలో అగ్నిప్రమాదం**
* **మూడంతస్తుల భవనంలోని మూడో ఫ్లోర్‌లో చెలరేగిన మంటలు**
* **ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణ నష్టం**
* **షార్ట్ సర్క్యూట్‌పై అనుమానం**



హైదరాబాద్: పాతబస్తీ పరిధిలోని ఫతే దర్వాజా ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అక్కడి ఒక మూడంతస్తుల భవనంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం సంభవించకపోవడంతో అటు అధికారులు, ఇటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతే దర్వాజాలో ఉన్న ఈ భవనంలోని మూడో అంతస్తులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అవి క్షణాల్లోనే ఉవ్వెత్తున ఎగసిపడటంతో పాటు దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు కింది అంతస్తులకు, పక్కనున్న భవనాలకు వ్యాపించకుండా సకాలంలో చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు వెల్లడించారు. అయితే, ఈ ఘటనలో భారీగానే ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం, షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం ప్రమాద కారణాలతో పాటు ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలపై స్పష్టత వస్తుందని అధికారులు వివరించారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376 వ జయంతి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : కీతవారిగూడెం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు గుండు రాంబాబు, పోలంపల్లి ఆనంద్ బాబు, గౌడ సంఘం చైర్మన్ చనగాని పురుషోత్తం, మండవ నాగేశ్వరరావు, అమరగాని బక్కయ్య, బాదే నరసయ్య, నర్సింగ్ రవి, బొల్లెపల్లి శ్రీనివాస్, గుండు సైదులు, నర్సింగ్, సైదులు, షేక్ సైదాహుస్సేన్, అమరగాని పిచ్చయ్య, పెండేం ధనమూర్తి, నర్సింగ్, నాగ సైదులు, నర్సింగ్ కాశయ్య, అనంతు వెంకటయ్య, గౌడ యూత్ గుండు వీరబాబు పోలంపల్లి వేణు,తెలబాటి నరేష్, గుండు రమేష్, అమరగాని యశ్వంత్, అమరగాని సతీష్, గుండు సతీష్, గుండు వంశీ, అనంతు శ్రావణ్, అమరగాని మణిదీప్, చనగాని నరసింహారావు, తెలబాటి శ్రీనివాస్, అమరగాని లక్ష్మణ్, పోలంపల్లి సైదులు, గుండు రాంచరణ్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు బడుగు బలహీన వర్గాలకు స్ఫూర్తిదాయకం

* **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బి.సి.సంక్షేమ అధికారి బి.సుబ్బా రెడ్డి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ శ్యాంసుందర్, కలెక్టరేట్ అంజిరెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది మరియు కల్లుగీత కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు రాంపల్లి సోములు, జిల్లా కార్యదర్శి బొమ్మకంటి బాలరాజు, బొల్లేపల్లి మాజీ సర్పంచ్ గోదా శ్రీనివాస్ గౌడ్, బి.సి సంఘం, అధక్షుడు కె.బాలరాజు, సామాజిక కార్యకర్త కె.వెంకటేష్, జి.సోములు, కె..అశోక్, ఆర్.కొండల్, ఆర్,చంద్రయ్య, పి.మైసయ్య, యన్.ఆంజనేయులు, బి,సత్తయ్య, కె.మధు, కె.వెంకటేష్, బి.శంకర్, కె.భూపాల్, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తా

**: కొల్లి కల్పనా చౌదరి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థులు బాగా చదువుకుని ఉద్యోగాలు సాధించి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కొల్లు ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై శ్రద్ధ వహించి చదువులో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. సుజాతనగర్ మండలం స్టేషన్ బేతంపుడిలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కల్పనా చౌదరి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ స్టేషనరీ పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఫౌండేషన్ ద్వారా ఆండగ నిలవడమే కాక, పాఠశాలలో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు కల్పనా చౌదరి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి మధ్య తీవ్ర వాగ్వాదం

* **అభివృద్ధి పనుల జాప్యంపై మంత్రిని ప్రశ్నించిన ఎమ్మెల్యే**
* **గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణంపై ఎదురుదాడికి దిగిన మంత్రి**
* **కేసీఆర్ వల్లే రాష్ట్రం అప్పులపాలైందన్న జూపల్లి కృష్ణారావు**



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో చోటుచేసుకున్న ఈ ఘటన, ఇరు పార్టీల మధ్య నెలకొన్న రాజకీయ వేడికి అద్దం పట్టింది. ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద కుట్టు మిషన్ల పంపిణీతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, నియోజకవర్గంలో రూ. 2.50 కోట్లతో సమేల రోడ్డు, రూ. 1.50 కోట్లతో పాతగూడ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ, పనులు ఎందుకు ప్రారంభం కాలేదని మంత్రిని ప్రశ్నించారు. స్వయంగా మంత్రి ప్రారంభించిన పనులకే ఈ పరిస్థితి ఎదురైతే అభివృద్ధి ఎలా సాధ్యమని ఆమె నిలదీశారు. దీనిపై మంత్రి జూపల్లి స్పందిస్తూ, 2018 నుంచి 2023 మధ్య కాలంలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు నిర్మించారో చెప్పాలని ఎమ్మెల్యేను ఎదురు ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం ముదిరింది.

## వందేమాతరం అంటే నాటి బ్రిటీష్ పాలకులకు, నేటి కాంగ్రెస్‌కే భయం



వందేమాతరం గీతం విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేమాతరం అనగానే ఒకప్పుడు బ్రిటీష్ పాలకులకు ఏ విధమైన భయం కలిగేదో, నేడు కాంగ్రెస్ పార్టీకి సైతం అదే భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ విషయంలో నాటి బ్రిటిష్ పాలకులకు, నేటి కాంగ్రెస్ నాయకులకు మధ్య పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేల వైఖరి చూసి దేశ ప్రజలంతా విస్మయం చెందుతున్నారని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వందేమాతరం గీతాలాపనను నిరోధించడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. దేశంలో కేవలం కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో దేశ ప్రజల్లో స్ఫూర్తిని రగిల్చిన ఈ గీతం పట్ల కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరికాదని బండి సంజయ్ హితవు పలికారు.



# మధుర పరిమళాల మనోహరం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**





హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్సను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన





కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.


# చెమట పడితే మంచిదేనట!

**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

వడదెబ్బ తగలకుండా..!

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**



స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్ కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

# MOVIE TIME




## సిగ్మా రిలీజ్ డేట్ ఫిక్స్

దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహించిన సిగ్మా మూవీ కొత్త రిలీజ్ డేట్ మంగళవారం ఖరారైంది. అక్టోబర్ 2న ఈ యాక్షన్ అడ్వెంచర్ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ తమిళంతో పాటు తెలుగులోనూ సేమ్ టైటిల్‌తో రిలీజ్ కాబోతుంది. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో కేథరిన్ ఓ స్పెషల్ సాంగ్‌లో నటించింది. తమన్ మ్యూజిక్ అందించగా లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ మూవీతోనే జాసన్ సంజయ్ దర్శకుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్నాడు. ఇదిలా ఉండగా వెంకటేష్ ఆదర్శకుటుంబం అదే రోజు రిలీజ్ కానుండడంతో ఆసక్తికరంగా మారింది.

## లేడీ ఓరియెంటెడ్ మూవీలో నిధి



రాజాసాబ్ తర్వాత నిధి అగర్వాల్ ఓ లేడీ ఓరియెంటెడ్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈ మూవీ నిధి అగర్వాల్ బర్త్‌డే సందర్భంగా సోమవారం ప్రారంభమైంది. నిధి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో యువరాణి లా ఒంటినిండా ఆభరణాలతో చేతిలో ప్రమిద పట్టు కొని కనిపిస్తోంది. ఆమె వెనుక కాళికా అమ్మవారి విగ్రహం కనిపించడం ఆసక్తిని పంచుతోంది. ఇందులో రెండు భిన్న కోణాల్లో ఆమె రోల్ సాగనున్నట్లు సమాచారం. ఓ పురాణాల్లో ఎవరికి తెలియని ఓ కథతో ఈ మూవీ రూపొందుతోన్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ మూవీకి శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తుండగా సునీత్ పడొల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం.



## మోహన్‌లాల్ మూవీకి షాక్

- శబరిమలలో షూటింగ్‌కు అనుమతి నిరాకరణ

మోహన్‌లాల్ హీరోగా తరుణ్ మూర్తి దర్శకత్వంలో అతిమనోహరం పేరుతో ఓ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. శబరిమల సన్నిధానంతో పాటు పంబ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ కోసం మేకర్స్ అటవీ అధికారులను సంప్రదించారు. వారు నిరాకరించడంతో మేకర్స్ కేరళం కోర్టుకు వెళ్లారు. పెరియార్ టైగర్ రిజర్వ్ అధికారుల వాదనలతో కోర్టు ఏకీభవించి అటవీ శాఖ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని వెల్లడించింది. ఈ వివాదంపై కేరళం దేవాదాయ శాఖ మంత్రి కే మురళీధర్ మాట్లాడుతూ.. ప్రకృతి వనరులు, పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉండడంతో సినిమాకు అనుమతి ఇవ్వలేదన్నారు. కాగా ఈ మూవీలో మోహన్‌లాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు.

## ఆ ప్రభావం కొంతే ఉంటది





అనుపమ పరమేశ్వరన్‌తో బ్రేకప్‌పై కోలీవుడ్ యంగ్ హీరో ధృవ్ విక్రమ్ రియాక్ట్ అయ్యాడు. తాజాగా ఓ తమిళ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడాడు. బ్రేకప్ తర్వాత గత కొన్ని నెలల కాలం కష్టంగా గడిచింది. నా వ్యక్తిగత జీవితంపై చాలానే ప్రభావం పడింది. నా కుటుంబం అందించిన ధైర్యం వల్లే బ్రేకప్ బాధ నుంచి బయటపడ్డా. మనలో నిజాయితీ ఉన్నప్పుడు.. నిజం వైపే నిలబడినప్పుడు ఏ విమర్శ నన్ను ఏం చేయలేదు. వాటి ప్రభావం నాపై కొంతే ఉంటుందని తెలుసుకున్నా" అని ధృవ్ విక్రమ్ చెప్పుకొచ్చాడు.



## మెగా హీరో మూవీలో లక్కీ ఛాన్స్

ధురంధర్ బ్యూటీ సారా అర్జున్ తెలుగులో గోల్డెన్ ఛాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. మెగా హీరో రామ్‌చరణ్‌తో జోడీ కట్టబోతున్నట్లు చెబుతోన్నారు. డైరెక్టర్ సుకుమార్, రాంచరణ్ కాంబినేషన్‌లో వస్తోన్న ఆర్‌సీ 17 మూవీలో సారా నటించనుందట. మొదట రష్మిక మందన్న, కియారా అద్వానీ, కృతి సనన్ పేర్లు వినిపించగా వీరందరిని కాదని సారా ఈ గోల్డెన్ ఛాన్స్‌ను దక్కించుకుందట. ధురంధర్–2లో సారా అర్జున్ నటనకు సుకుమార్ తెగ ఇంప్రెస్ అయ్యి ఛాన్స్ ఇచ్చాడట. సెప్టెంబర్‌లో రామ్‌చరణ్, సారా అర్జున్‌లపై ఓ ఫొటో షూట్ నిర్వహించబోతున్నట్లు చెబుతున్నారు. అప్పుడే ఈ ముంబై బ్యూటీ పేరును అఫీషియల్‌గా కన్ఫామ్ చేసే అవకాశం ఉందని అంటున్నారు.



## తల్లి పాత్ర చేస్తే తప్పా

ఢిల్లీ బ్యూటీ తాప్సీ గాంధారి పేరుతో బాలీవుడ్‌లో రివేంజ్ థ్రిల్లర్ మూవీ చేస్తోంది. ఈ సినిమాలో తల్లి పాత్రలో నటిస్తుండడంపై విమర్శలు రావడంతో ఆమె రియాక్ట్ అయ్యింది. కెరీర్ ఆరంభంలో నాకు డిఫరెంట్ రోల్స్ చేసే అవకాశం రాలేదు. ఇప్పుడు ఆ ఛాన్స్ వచ్చింది. సామాజిక కట్టుబాట్ల కారణంగా మహిళలు తమ ఇష్టానికి వ్యతిరేకంగా జీవనం కొనసాగిస్తుంటారు. అలాంటి వారి జీవితాలను స్క్రీన్‌పై చూపించే సినిమాల్లో నటిస్తే బాగుంటుందని అనుకున్నా. అందుకే కమర్షియల్ సినిమాలకు దూరంగా ఉంటున్నా అని చెప్పకొచ్చింది తాప్సీ. దేవాశిష్ మాకిజా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.